# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-08-2017** **సమయం : 6.45 గంటలు**

1. **ఆంధ్రప్రదేశ్‌లో 8, తెలంగాణాలో 11 సాగునీటి ప్రాజెక్టులను 2019 నాటికి పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను నాబార్డు ద్వారా తక్కువ వడ్డీకి సమకూర్చేందుకు కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.**

2. **తెలంగాణా రాష్ట్రంలో 84 వేల ఉద్యోగ నియామకాలకు చర్యలు చేపట్టవల్సిందిగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు.**

3. **ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడుకు ఈ నెల 21వ తేదీన పౌర సన్మానం జరపాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.**

4. **తట్టు, రూబెల్లా నివారణకు ఉద్దేశించిన టీకాల కార్యక్రమం తెలంగాణా రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు ప్రారంభమవుతుంది.**

================

ఆంధ్రప్రదేశ్‌లో 8, తెలంగాణాలో 11 సాగునీటి ప్రాజెక్టులను 2019 నాటికి పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను నాబార్డు ద్వారా తక్కువ వడ్డికి సమకూర్చేందుకు కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన నిన్న కొత్త ఢిల్లీలో జరిగిన మంత్రి మండలి సమావేశంలో దేశ వ్యాప్తంగా ఈ మేరకు నిదులు సమకూర్చేందుకు నిర్ణయం తీసుకోగా, వాటిలో ఇరు తెలుగు రాష్ట్రాలకు చెందిన 14 ప్రాజెక్టులు కూడా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని గుండ్లకమ్మ, ముసురుమిల్లి, పుష్కర ఎత్తిపోతలు, తోటపల్లి, తాటిపూడి, తారక రామ తీర్థ జలవనరుల పథకాలకు, తెలంగాణాలోని గొల్లవాగు, దేవాదుల శ్రీరాంసాగర్ రెండవ దశ నీటి పారుదల ప్రాజెక్టులకు నాబార్డు నుండి నిధులు లభ్యమవుతాయి.

-------------------------

తెలంగాణా రాష్ట్రంలో కొత్తగా 84 వేలకు పైగా ఉద్యోగ నియామకాలు చేపట్టాల్సి వున్నందున శాఖల వారీగా కార్యచరణ రూపొందించుకుని అమలు చేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అధికారులను ఆదేశించారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ గంటా చక్రపాణి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ప్రభుత్వ అధికారులు కనీసం వారినికోసారి సమావేశమై ఖాళీల భర్తీ, కొత్త ఉద్యోగాల నియామక ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు.

ఇలావుండగా, పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో కొత్తగా 90 మంది ఉద్యోగాల నియామకానికి ముఖ్యమంత్రి అంగీకారం తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఉద్యోగ నియామకాలకు సంబంధించి కీలక ప్రకటన

చేసిన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఆమరునాడే ఈ దిశగా చర్యలు చేపట్టారు.

---------------------------

తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ఇంటికి నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కె.తారక రామారావు స్పష్టం చేశారు. మిషన్ భగీరథ కార్యక్రమంలో భాగంగా 628కోట్ల రూపాయలతో ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలోని 163 గ్రామాలు, 7 మున్సిపాల్టీలకు ఇంటింటికి కుళాయి సౌకర్యం కల్పించే పథకం పైలాన్‌ను హైదరాబాద్ శివారు కొంపల్లిలో మంత్రి నిన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి...

**- : వాయిస్ : -**

---------------------------

కృత్రిమ మోచిప్పల ధరలపై కేంద్ర ప్రభుత్వం గరిష్ట పరిమితులు విధించింది. అత్యధిక శస్త్ర చికిత్సల్లో ఉపయోగించే కోబాల్ట్ క్రోమియం మోచిప్పల ధరను లక్షా 58 వేల రూపాయల నుండి 55 వేల రూపాయలకు పరిమితి విధించడంతోపాటు మిగిలిన ధరలకు కూడా కేంద్ర ప్రభుత్వం పరిమితులు విధించిది. ఈ పరిమితి నిన్నటి నుండి అమలులోకి వచ్చిందని కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి అనంత కుమార్ ప్రకటించారు. ప్రభుత్వ నిర్ణయంతో సుమారు రెండు కోట్ల మంది రోగులు ప్రయోజనం కలుగుతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేయని వైద్య సంస్థలపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉల్లంఘించి అధిక ధరలు వసూలు చేసిన 39 వైద్యసంస్థలకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని దేవాలయాల్లో నెలకు పది వేల రూపాయల వేతనం పొందుతున్న ధార్మిక సిబ్బంది వేతనంలో తగ్గింపు ఉండదని దేవాదాయ శాఖ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని వివిధ దేవాలయాల్లో 14 వందల 58 మంది ధార్మిక సిబ్బందికి పది వేల రూపాయల చొప్పున నెలసరి వేతనం లభిస్తోందని ఆ ప్రకటనలో ఆయన వివరించారు. అయితే, గ్రామీణ ప్రాంతాల్లో కనీస ఆదాయం లభించని దేవాలయాల్లోని ధార్మిక సిబ్బందికి నెలకు ఐదు వేల రూపాయల చొప్పున వేతనం చెల్లించే అంశంపై అర్చకులతో గత నెల 6వ తేదీన చర్చ జరిగినట్లు ఆయన తెలిపారు.

---------------------------

ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడుకు తెలంగాణ ప్రభుత్వం, ప్రజల తరుపున ఈ నెల 21వ తేదీన పౌర సన్మానం జరపాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు నిర్ణయించారు. రాజ్‌భవన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అనంతరం వెంకయ్యనాయుడు గౌరవార్థం దిల్‌కుషా అతిథి గృహం ప్రాంగణంలో ప్రత్యేక విందును ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

-------------------------

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తట్టు, రుబెల్లా వ్యాధుల నివారణ కోసం ఉద్దేశించిన టీకాల కార్యక్రమం ఈ రోజు ప్రారంభమవుతుంది. రాష్ట్రంలోని 9 నెలల వయస్సు నుండి 15 ఏళ్ళ వయస్సు గల పిల్లలు అందరికీ టీకాలు వేసే కార్యక్రమం ఐదు వారాలపాటు కొనసాగుతుందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి పి.లక్ష్మారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నాలుగు వారాల పాటు టీకాల కార్యక్రమాన్ని నిర్వహించి చివరిగా ఐదవ వారం ఇంటింటికి తిరిగి టీకాలు వేయడానికి ఒక కార్యచరణ ప్రణాళికను రూపొందించినట్లు ఆయన తెలిపారు. తమ బిడ్డలకు టీకాలు వేయించడానికి తల్లిదండ్రులు సహకరించాలని లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లిగూడెంలో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ సాంకేతిక విద్యా సంస్థ -నిట్‌లో ఒక ఉన్నత స్థాయి డైరెక్టర్‌తోపాటు మరో ముగ్గురు బోధనేతర సిబ్బంది నియామకానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన నిన్న సమవేశమైన మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టంలో పొందుపరచిన అంశానికి అనుగుణంగా కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ నిట్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేసింది.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఈ రోజు నుంచి ఈ నెల 28వ తేదీ వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్‌సి కార్యదర్శి వై.వి.ఎస్.టి.శాయి ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, అనంతపురం జిల్లాల్లోని మొత్తం 11 కేంద్రాల్లో 78 పోస్టుల భర్తీ కోసం నిర్వహిస్తున్న ఈ పరీక్షలకు 3 వేల 900 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఏపీపీఎస్‌సి వెబ్‌సైట్ నుంచి అభ్యర్థులు హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

-------------------------

అస్సోం రాష్ట్రంలోని కిషన్‌గంజ్, పాంజీపార రైల్వే మార్గాలపై వరద నీరు ప్రవహిస్తుండటంతో ఉత్తర సరిహద్దు రైల్వే కొన్ని రైళ్ళను రద్దు చేసింది. గౌహతి నుండి సికింద్రబాద్‌కు ఈ రోజు బయలుదేరవలసిన ఎక్స్‌ప్రెస్, గౌహతి నుండి చెన్నైకు రేపు బయలుదేరవలసిన ఎక్స్‌ప్రెస్‌ను, దిబ్రుఘడ్ నుండి కన్యాకుమారికి ఎల్లుండి బయలుదేరవలసిన రైళ్ళను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

-------------------------

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో తెలంగాణాలో రాగల 24 గంటల్లో భారీ వర్షాలు, కోస్తాంధ్రలోని కొన్ని ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతారణ శాఖ తెలియజేసింది. కాగా నైరుతి రుతుపవనాల ప్రభావంతో రాయలసీమ జిల్లాల్లో రాగల 24 గంటల్లో ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలియజేసింది.

-------------------------

రైళ్ళ, రైల్వేస్టేషన్లు, వాటి పరిసరాల్లో పరిశుభ్రతకు జాతీయ స్థాయిలో చేపట్టిన స్వచ్ఛ పక్షోత్సవాన్ని విజవయాడ రైల్వేస్టేషన్‌లో రైల్వే డివిజనల్ మేనేజర్ ఆర్.ధనుంజయులు నిన్న ప్రారంభించారు. స్వచ్ఛ రైల్ – స్వచ్ఛ భారత్ పేరుతో అమలు జరుగుతున్న ఈ కార్యక్రమంలో రైల్వేలోని అన్ని స్థాయిల్లోని అధికారులు, సిబ్బంది పాల్గొంటారని ఈ సందర్భంగా ధనుంజయులు తెలిపారు. గతంలో రైల్వేస్టషన్ల పరిశుభ్రతపై నర్విహించిన సర్వేలో విజయవాడ రైల్వేస్టేషన్ జాతీయ స్థాయిలో 4వ స్థానం దక్కించుకుందని, ఆస్థాయిని నిలుపుకోవడంతోపాటు దానిని మరింతగా మెరుగుపరచుకోవడానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. స్వచ్ఛ రైల్– స్వచ్ఛ భారత్ కార్యక్రమం రైల్వే డివిజన్‌లోని అన్ని రైల్వే స్టేషన్లలో 15 రోజులపాటు అమలు జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది, రైల్వే పాఠశాల విద్యార్థులు, స్కౌట్స్ అండ్ గైడ్ వాలంటీర్లతో స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞను ఆయన చేయించారు.

================